**28-03-2024** ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఇది కళ్యాణకారీ పురుషోత్తమ సంగమయుగము, ఇందులో పాత ప్రపంచము మారి కొత్తగా అవుతుంది, ఈ యుగాన్ని మీరు మర్చిపోకండి"

ప్రశ్న:- తండ్రి చిన్నా-పెద్దా పిల్లలందరికీ తమ సమానముగా తయారుచేయడానికి ఒక ప్రేమపూర్వకమైన శిక్షణను ఇస్తారు, అది ఏమిటి?

జవాబు:- మధురమైన పిల్లలూ - ఇప్పుడు ఇక పొరపాట్లు చేయకండి. ఇక్కడికి మీరు నరుని నుండి నారాయణునిగా అయ్యేందుకు వచ్చారు కావున దైవీ గుణాలను ధారణ చేయండి, ఎవ్వరికీ దుఃఖాన్ని ఇవ్వకండి. పొరపాట్లు చేసినట్లయితే దుఃఖాన్ని ఇస్తారు. తండ్రి ఎప్పుడూ పిల్లలకు దుఃఖాన్ని ఇవ్వరు. వారు మీకు డైరెక్షన్ ఇస్తారు - పిల్లలూ, నన్నొక్కరినే స్మృతి చేయండి. యోగులుగా అయినట్లయితే వికర్మలు వినాశనమవుతాయి, మీరు చాలా మధురముగా అవుతారు.

ఓం శాంతి. ఏ పిల్లలైతే స్వయాన్ని ఆత్మగా భావిస్తూ పరమపిత పరమాత్మతో యోగాన్ని జోడిస్తారో, వారినే సత్యమైన యోగులు అని అంటారు, ఎందుకంటే తండ్రి ట్రూత్ (సత్యమైనవారు) కదా! మీ బుద్ధియోగము ఆ సత్యమైనవారితో ఉంది. వారు ఏదైతే వినిపిస్తారో, అదంతా సత్యమే. యోగులు మరియు భోగులు అంటూ రెండు రకాల వారు ఉంటారు. భోగులు కూడా అనేక రకాలవారు ఉంటారు, అలాగే యోగులు కూడా అనేక రకాలవారు ఉంటారు. మీ యోగము ఒకే రకమైన యోగము. వారి సన్యాసము వేరు, మీ సన్యాసము వేరు. మీరు పురుషోత్తమ సంగమయుగము యొక్క యోగులు. ఇంకెవ్వరికీ, తాము పావనులైన యోగులా లేక పతితులైన భోగులా అనేది తెలియదు, అసలు ఈ యోగాన్ని గురించే తెలియదు. పిల్లలకు ఇది కూడా తెలియదు. బాబా అయితే అందరినీ పిల్లలూ, పిల్లలూ అని అంటారు ఎందుకంటే - తాను అనంతమైన ఆత్మలకు తండ్రి అన్న విషయము బాబాకు తెలుసు, అలాగే మీరు ఏమని భావిస్తారంటే - ఆత్మలమైన మనమందరమూ పరస్పరం సోదరులము, వారు మనకు తండ్రి. మీరు తండ్రితో యోగాన్ని జోడించడం ద్వారా పవిత్రముగా అవుతారు. వారు భోగులు, మీరు యోగులు. తండ్రి తమ పరిచయాన్ని మీకు ఇస్తారు. ఇది పురుషోత్తమ సంగమయుగమని కూడా మీకు తెలుసు. ఈ విషయాన్ని గురించి మీకు తప్ప ఇంకెవ్వరికీ తెలియదు. దీని పేరే పురుషోత్తమ సంగమయుగము, అందుకే పురుషోత్తమ అన్న పదాన్ని ఎప్పుడూ మర్చిపోకండి. ఇది పురుషోత్తములుగా తయారయ్యే యుగము. ఉన్నతులైన మరియు పవిత్రులైన మనుష్యులను పురుషోత్తములు అని అంటారు. ఈ లక్ష్మీ-నారాయణులే ఉన్నతులుగా మరియు పవిత్రులుగా ఉండేవారు. మీకు ఇప్పుడు సమయము గురించి కూడా తెలిసింది. 5,000 సంవత్సరాల తర్వాత ఈ ప్రపంచము పాతబడిపోతుంది. దీనిని మళ్ళీ కొత్తగా తయారుచేయడానికి తండ్రి వస్తారు. ఇప్పుడు మనం సంగమయుగ బ్రాహ్మణ కులానికి చెందినవారము. ఉన్నతోన్నతమైనవారు బ్రహ్మ, కానీ బ్రహ్మను శరీరధారిగా చూపిస్తారు. శివబాబా అయితే అశరీరి. అశరీరి మరియు శరీరధారుల మిలనము జరుగుతుందని పిల్లలు అర్థం చేసుకున్నారు. వారిని మీరు బాబా అని అంటారు. ఇది అద్భుతమైన పాత్ర కదా. వీరికి మహిమ కూడా ఉంది, మందిరాలు కూడా తయారవుతాయి. ఒక్కొక్కరూ ఒక్కొక్క రకంగా రథాన్ని అలంకరిస్తారు. అనేక జన్మల అంతిమ జన్మలో అంతిమ సమయంలో నేను ప్రవేశిస్తాను అని కూడా బాబా తెలియజేశారు. ఎంత స్పష్టముగా అర్థం చేయిస్తారు. మొట్టమొదట భగవానువాచ అని అనవలసి ఉంటుంది. ఆ తర్వాత నేను అనేక జన్మల అంతిమంలో అన్ని రహస్యాలను పిల్లలకే అర్థం చేయిస్తాను, ఇంకెవరూ ఈ విషయాలను అర్థం చేసుకోలేరు కూడా. పిల్లలైన మీరు కూడా అప్పుడప్పుడూ మర్చిపోతారు. పురుషోత్తమ అన్న పదాన్ని వ్రాయడం ద్వారా ఈ పురుషోత్తమ యుగమే కళ్యాణకారీ యుగము అని భావిస్తారు. ఒకవేళ యుగము గుర్తున్నట్లయితే ఇప్పుడు మేము కొత్త ప్రపంచం కొరకు మారుతున్నాము అని భావిస్తారు. కొత్త ప్రపంచములో దేవతలే ఉంటారు. యుగాలను గురించి కూడా ఇప్పుడు మీకు తెలిసింది.

తండ్రి అర్థం చేయిస్తున్నారు - మధురమైన పిల్లలూ, సంగమయుగాన్ని ఎప్పుడూ మర్చిపోకండి. దీనిని మర్చిపోవడంతో మొత్తం జ్ఞానమంతటినీ మర్చిపోతారు. ఇప్పుడు మనం మారుతున్నామని పిల్లలైన మీకు తెలుసు. ఇప్పుడు పాత ప్రపంచం కూడా మారి కొత్తగా అవ్వనున్నది. తండ్రి వచ్చి ప్రపంచాన్ని కూడా మారుస్తారు, అలాగే పిల్లలను కూడా మారుస్తారు. వారు పిల్లలూ, పిల్లలూ అని అందరినీ అంటారు. మొత్తం ప్రపంచమంతటిలో ఏయే ఆత్మలైతే ఉన్నారో, వారందరూ పిల్లలే. అందరి పాత్ర ఈ డ్రామాలో ఉంది. చక్రాన్ని కూడా నిరూపించాలి. ప్రతి ఒక్కరూ

తమ-తమ ధర్మాలను స్థాపన చేస్తారు. ఈ దేవీ-దేవతా ధర్మాన్ని తండ్రి తప్ప ఇంకెవ్వరూ స్థాపన చెయ్యలేరు. ఈ ధర్మాన్ని బ్రహ్మ ఏమీ స్థాపన చెయ్యరు. కొత్త ప్రపంచములో దేవీ-దేవతా ధర్మము ఉంటుంది. పాత ప్రపంచములో అంతా మనుష్యులే మనుష్యులు ఉంటారు. కొత్త ప్రపంచములో దేవీ-దేవతలు ఉంటారు. దేవతలు పవిత్రులు. అక్కడ రావణ రాజ్యమే లేదు. తండ్రి పిల్లలైన మీకు రావణునిపై విజయాన్ని ప్రాప్తింపజేస్తారు. రావణునిపై విజయం ప్రాప్తించగానే రామరాజ్యం ప్రారంభమైపోతుంది. రామరాజ్యం అని కొత్త ప్రపంచాన్ని మరియు రావణరాజ్యం అని పాత ప్రపంచాన్ని పిలువడం జరుగుతుంది. రామరాజ్యం ఎలా స్థాపనవుతోంది అనేది పిల్లలైన మీకు తప్ప ఇంకెవ్వరికీ తెలియదు. రచయిత అయిన తండ్రి కూర్చుని పిల్లలైన మీకు రచన యొక్క రహస్యాన్ని అర్థం చేయిస్తారు. తండ్రి రచయిత, బీజరూపుడు. బీజాన్ని వృక్షపతి అని అంటారు. అది జడమైన బీజము. వీరినైతే అలా భావించరు. బీజము నుండే మొత్తం వృక్షమంతా వెలువడుతుందని మీకు తెలుసు. మొత్తం విశ్వమంతటి వృక్షం ఎంత పెద్దగా ఉంది. అది జడమైనది, ఇది చైతన్యమైనది. సత్ చిత్ ఆనంద స్వరూపుడు, మనుష్య సృష్టికి బీజరూపుడు తండ్రే, వారి నుండి ఎంత పెద్ద వృక్షము వెలువడుతుంది. మోడల్ నైతే చిన్నదిగానే తయారుచేస్తారు. మనుష్య సృష్టి వృక్షము అన్నింటికన్నా పెద్దది. ఉన్నతోన్నతుడైన తండ్రి నాలెడ్జ్ ఫుల్. ఆ వృక్షాల జ్ఞానం ఎంతోమందికి ఉంటుంది, ఈ వృక్షము యొక్క జ్ఞానమునైతే ఒక్క తండ్రే ఇస్తారు. ఇప్పుడు తండ్రి మీకు హద్దులోని బుద్ధిని మార్చి అనంతమైన బుద్ధిని ఇచ్చారు. మీరు ఈ అనంతమైన వృక్షాన్ని తెలుసుకున్నారు. ఈ వృక్షానికి ఎంత అనంతమైన ఆకాశము లభించి ఉంది. తండ్రి పిల్లలను అనంతములోకి తీసుకువెళ్లారు. ఇప్పుడు మొత్తం ప్రపంచమంతా పతితముగా ఉంది. మొత్తం సృష్టి అంతా హింసాయుతముగా ఉంది. అందరూ ఒకరినొకరు హింసించుకునే వారే. ఇప్పుడు పిల్లలైన మీకు జ్ఞానం లభించింది. అహింసాయుతమైనది ఒక్క దేవీ-దేవతా ధర్మమే, అది సత్యయుగములో ఉంటుంది. సత్యయుగములో అందరూ పవిత్రముగా, సుఖ-శాంతులతో ఉంటారు. 21 జన్మల కొరకు అన్ని మనోకామనలు పూర్తయిపోతాయి. సత్యయుగములో ఎటువంటి కామనలు ఉండవు. ధాన్యము మొదలైనవన్నీ అపారముగా లభిస్తాయి. ఈ బొంబాయి మొదట ఉండేది కాదు. దేవతలు ఉప్పునీటి తీరాలలో (సాగర తీరాలలో) ఉండరు. తీయటి నదులు ఎక్కడైతే ఉండేవో, అక్కడే దేవతలు ఉండేవారు. మనుష్యులు చాలా కొద్దిమందే ఉండేవారు, ఒక్కొక్కరికి ఎంతో భూమి ఉంటుంది. సత్యయుగములో నిర్వికారీ ప్రపంచమే ఉంటుంది. మీరు యోగబలముతో విశ్వరాజ్యాన్ని తీసుకుంటారు. దానినే రామరాజ్యం అని అంటారు. మొట్టమొదట కొత్త వృక్షము చాలా చిన్నదిగా ఉంటుంది. మొదట కాండములో ఒకే ధర్మం ఉండేది. తర్వాత ఆ కాండము నుండి మూడు శాఖలు వెలువడుతాయి. దేవీ-దేవతా ధర్మమే పునాది వలె ఉంటుంది. కాండము నుండి చిన్న-చిన్న శాఖోపశాఖలు వెలువడుతాయి. ఇప్పుడైతే ఈ వృక్షము యొక్క కాండమే లేదు, ఇటువంటి వృక్షము ఇంకేదీ ఉండదు. దీనిని మర్రి వృక్షముతో పోల్చడం ఏక్యురేట్ పోలిక. మర్రి వృక్షమంతా నిలబడి ఉంటుంది, కానీ దాని కాండమే లేదు, అయినా కానీ అది ఎండిపోదు. మొత్తం వృక్షమంతా పచ్చగా నిలబడి ఉంది కానీ దేవీ-దేవతా ధర్మము యొక్క పునాది లేదు. కాండమైతే ఇదే కదా. రామరాజ్యం లేక దేవీ-దేవతా ధర్మం కూడా ఆ కాండములోకే వస్తుంది. తండ్రి అంటారు - నేను 3 ధర్మాలను స్థాపన చేస్తాను. ఈ విషయాలన్నింటినీ సంగమయుగ బ్రాహ్మణులైన మీరే అర్థం చేసుకుంటారు. బ్రాహ్మణులైన మీది చిన్నని కులము. చిన్న-చిన్న మఠాలు, ఆశ్రమాలు వెలువడతాయి కదా. అరవింద ఆశ్రమము ఉంది, వారు ఎంత త్వరత్వరగా వృద్ధిని పొందుతారు ఎందుకంటే వారిలో వికారాల విషయములో వద్దనేదేమీ లేదు. ఇక్కడ తండ్రి - కామం మహాశత్రువు, దానిపై విజయాన్ని పొందాలి అని అంటారు. ఈ విధంగా ఇంకెవ్వరూ అనలేరు. లేకపోతే వారి వద్ద కూడా గొడవలు జరుగుతాయి. ఇక్కడ అందరూ పతిత మనుష్యులే, కావున పావనంగా అయ్యే విషయాన్ని వినరు. వికారాలు లేకుండా పిల్లలు ఎలా జన్మిస్తారు? అని అంటారు. పాపం వారి దోషం కూడా ఏమీ లేదు. భగవానువాచ - కామం మహాశత్రువు, దానిపై విజయాన్ని పొందడం ద్వారా జగత్ జీతులుగా అవుతారు అని గీతా పాఠకులు కూడా అంటారు కానీ అర్థం చేసుకోరు. వారెప్పుడైతే ఈ మాటను వినిపిస్తారో, అప్పుడు వారికి అర్థం చేయించాలి. దీని గురించి బాబా ఏమంటారంటే - ఏ విధంగా హనుమంతుడు ద్వారం ముందు చెప్పుల వద్ద కూర్చొనేవారో, అలా బాబా కూడా అంటారు - మీరూ వెళ్ళి ఒక మూల కూర్చొని విని రండి. ఎప్పుడైతే వారు ఈ మాటను వినిపిస్తారో, అప్పుడు దీని రహస్యమేమిటి? అని వారిని అడగండి. జగత్ జీతులైతే ఈ దేవతలే, దేవతలుగా అయ్యేందుకు ఈ వికారాలను వదలవలసి ఉంటుంది అని ఈ మాటను కూడా మీరు చెప్పవచ్చు. ఇప్పుడు రామరాజ్య స్థాపన జరుగుతోందని మీకే తెలుసు. మహావీరులు కూడా మీరే. ఇందులో భయపడే విషయమేదీ లేదు. చాలా ప్రేమగా అడగాలి - స్వామీజీ, ఈ వికారాలపై విజయం పొందడం ద్వారా విశ్వానికి యజమానులుగా అవుతారు అని మీరు చెప్పారు కదా, కానీ పవిత్రముగా ఎలా అవ్వాలో మీరు చెప్పలేదు. ఇప్పుడు పిల్లలైన మీరు పవిత్రతలో ఉండే మహావీరులు. మహావీరులే విజయమాలలో కూర్చబడతారు. మనుష్యుల చెవులు రాంగ్ విషయాలను వినడానికి అలవాటుపడిపోయాయి. మీకు ఇప్పుడు ఆ రాంగ్ విషయాలను వినడం

ఇష్టమనిపించదు. రైట్ విషయాలే మీ చెవులకు మంచిగా అనిపిస్తాయి. చెడును వినకండి... మనుష్యులను సుజాగృతులుగా తప్పకుండా చేయాలి. పవిత్రులుగా అవ్వండి అని భగవంతుడు అంటారు. సత్యయుగములో అంతా పవిత్ర దేవతలే ఉండేవారు. ఇప్పుడు అందరూ అపవిత్రముగా ఉన్నారు. ఈ విధముగా అర్థం చేయించాలి, ఇలా చెప్పండి - మా వద్ద ఈ సత్సంగం జరుగుతోంది, అందులో కామం మహాశత్రువు అని అర్థం చేయిస్తారు, ఇప్పుడు పవిత్రముగా అవ్వాలనుకుంటే ఒక యుక్తి ద్వారా అలా అవ్వండి, స్వయాన్ని ఆత్మగా భావించండి, సోదర దృష్టిని పక్కా చేసుకోండి.

పిల్లలైన మీకు తెలుసు - మొట్టమొదట ఈ భారత్ చాలా సుసంపన్నమైన ఖండముగా ఉండేది, ఇప్పుడు ఖాళీ అయిపోయిన కారణముగా హిందుస్థాన్ అన్న పేరును పెట్టారు. మొదట భారత్ ధన-సంపదలతో, పవిత్రత, సుఖ-శాంతులతో అన్నింటితో నిండుగా ఉండేది. ఇప్పుడు దుఃఖాలతో నిండుగా ఉంది. అందుకే - దుఃఖహర్త, సుఖకర్త అని పిలుస్తారు. మీరు ఎంత సంతోషముగా తండ్రి ద్వారా చదువుకుంటారు. అనంతమైన తండ్రి నుండి అనంతమైన సుఖ వారసత్వాన్ని తీసుకోనివారు ఎవరు ఉంటారు! మొట్టమొదట తండ్రి గురించి అర్థం చేసుకోవాలి. తండ్రి గురించి తెలుసుకోకపోతే ఏ రహస్యమూ బుద్ధిలోకి రానే రాదు. కావున అనంతమైన తండ్రి ఎవరైతే అనంతమైన వారసత్వాన్ని ఇస్తారో, వారిపై నిశ్చయం కూర్చున్నాక ముందుకు వెళ్ళాలి. పిల్లలు తండ్రిని ఎటువంటి ప్రశ్నలూ అడగవలసిన అవసరం లేదు. తండ్రి పతిత-పావనుడు. వారినే మీరు స్మృతి చేస్తారు. మీరు వారి స్మృతి ద్వారానే పావనంగా అవుతారు. నన్ను పిలిచిందే అందుకోసము. జీవన్ముక్తి అనేది ఒక్క క్షణములో లభిస్తుంది. అయినా కానీ స్మృతియాత్రకు సమయం పడుతుంది. ముఖ్యంగా స్మృతియాత్రలోనే విఘ్నాలు కలుగుతాయి. అర్ధకల్పం దేహాభిమానులుగా ఉన్నారు. ఇప్పుడు ఈ ఒక్క జన్మ దేహీ-అభిమానులుగా అవడంలోనే శ్రమ ఉంది. ఈ బ్రహ్మా కొరకు కూడా ఇది చాలా సహజము. మీరు బాప్ దాదా అనే పిలుస్తారు. తండ్రి నా శిరస్సుపై సవారీ చేస్తున్నారు - అని ఇతను కూడా భావిస్తారు. వారిని ఎంతో మహిమ చేస్తాను, ఎంతో ప్రేమిస్తాను - బాబా, మీరు ఎంత మధురమైనవారు, కల్పకల్పమూ మాకు ఎంత నేర్పిస్తారు, మళ్ళీ అర్ధకల్పం మిమ్మల్ని తలచుకోను కూడా తలచుకోను, ఇప్పుడైతే ఎంతగానో స్మృతి చేస్తాను. నిన్న నాలో ఏ జ్ఞానమూ లేదు. ఎవరినైతే పూజించేవాడినో, వారిగానే నేను అవుతానని నాకు తెలియదు. ఇప్పుడు ఆశ్చర్యమనిపిస్తుంది. యోగులుగా అవ్వడం ద్వారానే మళ్ళీ ఈ దేవీ-దేవతలుగా అవుతాము. నాకు కూడా అందరూ పిల్లలే, ఈ బాబా ఎంతో ప్రేమగా పిల్లలను సంభాళిస్తారు, వారి పాలనను చేస్తారు. వీరు కూడా నా సమానముగా నరుని నుండి నారాయణునిగా అవుతారు. మీరు ఇక్కడకు వచ్చిందే అందుకోసము. నేను ఎంతగా అర్థం చేయిస్తాను - పిల్లలూ, తండ్రిని స్మృతి చేయండి, దైవీ గుణాలను ధారణ చేయండి, అన్నపానాదులను సంభాళించుకోండి అని. అలా చేయకపోతే - ఇప్పుడింకా కొద్ది సమయం మిగిలి ఉంది అని భావిస్తాను. ఏవో ఒక పొరపాట్లు అయితే జరుగుతూ ఉంటాయి. చిన్నా, పెద్దా పిల్లలందరికీ ప్రేమగా అర్థం చేయిస్తాను - పిల్లలూ, పొరపాట్లు చేయకండి, ఎవ్వరికీ దుఃఖాన్ని ఇవ్వకండి. పొరపాట్లు చేస్తున్నారంటే దుఃఖాన్ని ఇస్తున్నారు. తండ్రి ఎప్పుడూ దుఃఖాన్ని ఇవ్వరు. వారు డైరెక్షన్ ఇస్తారు - నన్నొక్కరినే స్మృతి చేసినట్లయితే వికర్మలు వినాశనమైపోతాయి, చాలా మధురముగా అయిపోతారు. ఇంతటి మధురముగా తయారవ్వాలి, దైవీ గుణాలను ధారణ చేయాలి. పవిత్రముగా అవ్వండి. ఇక్కడకు అపవిత్రులు వచ్చేందుకు అనుమతి లేదు. అప్పుడప్పుడూ రానివ్వడం జరుగుతుంది, అది కూడా ఇప్పుడే జరుగుతుంది, కానీ ఎప్పుడైతే చాలా వృద్ధి జరుగుతుందో అప్పుడు దీనిని - టవర్ ఆఫ్ ప్యూరిటీ, టవర్ ఆఫ్ సైలెన్స్ అని అనడం జరుగుతుంది. ఇది ఉన్నతోన్నతమైన స్థానము కదా. స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రి స్మృతిలో ఉండడమే హైయ్యెస్ట్ పవర్ (ఉన్నతోన్నతమైన శక్తి). అక్కడ చాలా సైలెన్స్ ఉంటుంది. అర్ధకల్పం ఎటువంటి కొట్లాటలు మొదలైనవి జరగవు. ఇక్కడ ఎన్ని గొడవలు మొదలైనవి జరుగుతూ ఉంటాయి, శాంతి ఉండదు. మూలవతనమే శాంతిధామము. మళ్ళీ శరీరాన్ని ధారణ చేసి విశ్వంలో పాత్రను అభినయించడానికి వచ్చినప్పుడు అక్కడ కూడా శాంతి ఉంటుంది. ఆత్మ స్వధర్మమే శాంతి. రావణుడే అశాంతపరుస్తాడు. మీరు శాంతి శిక్షణను పొందుతూ ఉంటారు. ఎవరైనా కోపంలో ఉంటే వారు అందరినీ అశాంతపరుస్తారు. ఈ యోగబలము ద్వారా మీ నుండి మొత్తం చెత్త అంతా తొలగిపోతుంది. చదువు ద్వారా ఇలా చెత్త తొలగదు. స్మృతి ద్వారా చెత్త అంతా భస్మమైపోతుంది. తుప్పు వదిలిపోతుంది. తండ్రి అంటారు, నిన్న మీకు శిక్షణను ఇచ్చాను, మీరు అది మర్చిపోయారా ఏమిటి? ఇది 5,000 సంవత్సరాల విషయం, వారు లక్షల సంవత్సరాలు అని అనేస్తారు.

ఇప్పుడు మీకు సత్యాసత్యాల తేడా తెలిసింది. అసత్యమేమిటి, సత్యమేమిటి, అలాగే జ్ఞానమేమిటి, భక్తి ఏమిటి, భ్రష్టాచారము మరియు శ్రేష్ఠాచారము అని దేనినంటారు - ఇదంతా తండ్రే వచ్చి తెలియజేస్తారు. భ్రష్టాచారులు వికారాల

ద్వారా జన్మిస్తారు. అక్కడ వికారాలు ఉండవు. దేవతలు సంపూర్ణ నిర్వికారులు అని మీరు స్వయం అంటారు. అక్కడ రావణరాజ్యమే లేదు. ఇది సహజంగా అర్థం చేసుకోవలసిన విషయం. మరి ఇప్పుడు ఏమి చేయాలి? ఒకటేమో, తండ్రిని స్మృతి చేయాలి, ఇంకొకటి పవిత్రముగా తప్పకుండా అవ్వాలి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. పవిత్రముగా అవ్వడంలో మహావీరులుగా అవ్వాలి, స్మృతియాత్ర ద్వారా లోపల ఉన్న చెత్తను తొలగించివేయాలి. తమ శాంత స్వధర్మములో స్థితులవ్వాలి, అశాంతిని వ్యాపింపజేయకూడదు.

2. తండ్రి ఏవైతే రైట్ విషయాలను వినిపిస్తారో, వాటినే వినాలి. చెడును వినకూడదు... తప్పుడు విషయాలను వినకండి. అందరినీ సుజాగృతులుగా చేయండి. పురుషోత్తమ యుగములో పురుషోత్తములుగా అవ్వండి మరియు తయారుచేయండి.

వరదానము:- ఆత్మిక శక్తి ఆధారముగా తనువు యొక్క శక్తిని అనుభవము చేసే సదా ఆరోగ్యవాన్ భవ

ఈ అలౌకిక జీవితములో ఆత్మ మరియు ప్రకృతి, ఈ రెండింటి ఆరోగ్యము అవసరము. ఆత్మ ఆరోగ్యంగా ఉన్నప్పుడు తనువు యొక్క లెక్కాచారాలు మరియు తనువు యొక్క రోగము శూలము నుండి ముల్లుగా అయిన కారణంగా, స్వ-స్థితి కారణంగా ఆరోగ్యముగా ఉన్నట్లు అనుభవం చేస్తారు. వారి మాటలలో, ముఖములో అనారోగ్యపు కష్టము యొక్క గుర్తులు ఉండవు. కర్మభోగాన్ని వర్ణించేందుకు బదులుగా కర్మయోగ స్థితిని వర్ణన చేస్తారు. వారు పరివర్తనా శక్తితో ఆ కష్టాన్ని సంతుష్టతలోకి పరివర్తన చేసి సంతుష్టంగా ఉంటారు మరియు సంతుష్టతా అలను వ్యాపింపజేస్తారు.

స్లోగన్:- హృదయముతో, తనువుతో, పరస్పర ప్రేమతో సేవ చేసినట్లయితే సఫలత తప్పకుండా లభిస్తుంది.